మూణ్నాళ్లకే ముక్కలవుతున్నాయి!

- నాణ్యతలేని సీసీ రోడ్లు
- గ్రామాల్లో కంకర తేలి నడిచేందుకు కూడా ఇబ్బందులు


మెండోరా మండలం పోచంపాడ్‌లో కంకర తేలిన సిమెంట్ రోడ్డు

బాల్కొండ: పల్లెల్లో వేసిన సిమెంట్ రోడ్లు నాణ్యతా లోపం కారణంగా మున్నాళ్లకే ముక్కలవుతున్నాయి. కనీసం బిల్లులు వచ్చేవరకు కూడా మన్నిక లేకుండా పోతున్నాయంటే గ్రామాల్లో సీసీ రోడ్లు ఎంత నాణ్యతతో వేస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. కాని బిల్లులు మాత్రం పువ్వుల్లో పెట్టి అధికారులు అప్పగించారు. గత ఆర్థిక ఏడాది ముగింపు సమయంలో పల్లెల్లో హడావుడిగా సిమెంట్ రోడ్లు వేసి చేతులు దులుపుకున్నారు. మూడు నెలలు గడవక ముందే సీసీ రోడ్లపై పూర్తిగా కంకర తేలుతుంది. కేవలం కమిషన్ల కోసం సిమెంట్ రోడ్ల నిర్మాణాలు చేపట్టారనే విమర్శలున్నాయి. సరైన క్యూరింగ్ చేపట్టకుండానే సిమెంట్ రోడ్ల పని కానిచ్చేశారు. ఆర్థిక ఏడాది దాటిన తర్వాత సిమెంట్ రోడ్లు వేస్తే బిల్లులు అందాయని కొన్ని గ్రామాల్లో రాత్రి వేళల్లో కూడా పని కానిచ్చేశారు. ఎలాంటి సైజ్ లేకుండా ఓ చోట 10 ఫీట్ల వెడల్పు, మరో చోట 12 ఫీట్ల వెడల్పు ఇలా ఎలా నచ్చితే అలా రోడ్లు వేసి చేతులు దులుపుకున్నారు. దీంతో సిమెంట్ రోడ్ల లెక్క పత్రం లేకుండా పోయింది.

వర్షాలు కురిస్తే..

వానాకాలం వచ్చి వర్షాలు కురువక ముందే సీసీ రోడ్లపై మొత్తం కంకర తేలుతుంది. రానున్న కాలంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. వర్షాలకు ఆ రోడ్లు పూర్తిగా కొట్టుకుపోయే ప్రమాదం ఉంది. దీంతో ప్రజాధనం వర్షం నీటి పాలయ్యే ప్రమాదం లేక పోలేదు. ప్రతి గ్రామంలో 25 లక్షలకు తగ్గకుండా సీసీ రోడ్లకు నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. వాటిని 5 లక్షలకు ఒక బిట్ చొప్పున చేసి అనుకున్న వారు కాంట్రాక్టర్ అవతారమెత్తి సీసీ రోడ్లు వేశారు.

ప్రమాణాలు పాటించకపోవడంపై సర్వత్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉన్నతాధికారులు సీసీ రోడ్లపై పూర్తి స్థాయి లో విచారణ చేపట్టి సంబంధిత కాంట్రాక్టర్‌తోనే మరమ్మత్తులు వెంటనే చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

స్వల్పకాలిక పంటలను ఎంపిక చేసుకోవాలి


ముప్కాల్ మండలంలో పోసిన నారు

బాల్కొండ : వాతావరణ మార్పుల వలన రైతులు వరిలో స్వల్పకాలిక పంటలను ఎంపిక చేసుకోవాలని బాల్కొండ వ్యవసాయ అధికారి మహేందర్‌రెడ్డి రైతులకు సూచించారు. జూన్ నెలలో వర్షపాతం సాధరణం కంటే తక్కువ వర్షపాతం నమోదు కానున్న దృష్టా మళ్లీ జూలైలో విత్తడం పరిపాటైంది. ఆగష్టు 25 నుంచి 30 తారీఖుల మధ్యలో భారీ వర్షాలు కురిసి ప్రాజెక్టులు, చెరువులు కుంటలు నిండుతున్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని రైతులు జాగ్రత్త పడి వరిపంటలో స్వల్పకాలిక పంటలను ఎంపిక చేసుకోవాలి. బీపీటీకి బదులుగా 135 రోజుల్లో చేతికందే తెలంగాణ సోనా లేదా 118 రోజుల్లో వచ్చే అంజన, 95–100 రోజుల్లో వచ్చే ప్రత్యామ్నాయ రకాలను ఎంచుకోవాలి. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వరి పంటలో దొడ్డు రకం ఎంపిక కూడా చాల కీలకమేనని ఆయన పేర్కొన్నారు. 1010 రకం కంటే బతుకమ్మ రకం ఎంపిక చేసుకోవాలి. బతుకమ్మ రకం 130–135 రోజుల్లో చేతికి వస్తుందన్నారు. కూనారం సన్నాలు అనే పేరుతో సన్నరకం అంటూ కొత్తగా మార్కెట్‌లోకి వస్తున్నాయి. అవి 1010 కంటే దొడ్డుగానే ఉంటాయి. ఈ రకాలను జగిత్యాల్ పరిశోధన కేంద్రం నుంచి పొందవచ్చు.

కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి


గుత్ప పంప్‌హౌజ్‌ను పరిశీలిస్తున్న సుదర్శన్‌రెడ్డి

నందిపేట్(ఆర్మూర్) : కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడే తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి జరిగిందని మాజీ మంత్రి పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి అన్నారు. నందిపేట మండలంలోని ఉమ్మెడ శివారులో గల గుత్ప ఎత్తిపోతల పథకం పంపుహౌజ్‌ను సోమవారం మాజీ మంత్రి, టీపీసీసీ కోశాధికారి పొద్దుటూరి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాంసాగర్ చివరి ఆయకట్టు ప్రాంతంలోని సుమారు 50 వేల ఎకరాలకు సాగునీరందించాలనే సంకల్పంతో కాంగ్రెస్ ప్రభుత్వంలో 2008 లో ఆనాటి సీఎం వైస్ రాజశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించామన్నారు. అలాగే నందిపేట మండలంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో 9 ఎత్తిపోతల పథకాలు చేపట్టామన్నారు. నందిపేట మండలంలోని లక్కంపల్లి గ్రామ శివారులో ఫుడ్‌పార్కు (సెజ్) ఏర్పాటు కోసం కెటాయించిన 420 ఎకరాలు నిరుపయోగం గా ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరి వల్ల ఎటువంటి ప్రరిశ్రమలు స్థాపించలేదన్నారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కళ్లు తెరిచి లిఫ్ట్ ఇరిగేషన్‌కు నిధులు మంజూరు చేసి సెజ్‌లో పరిశ్రమలు ఏర్పాటు చేయాలని కోరారు. టీపీసీసీ ఉపాధ్యక్షులు తాహెర్‌బీన్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మానాల మోహన్, గడుగు గంగాధర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు వెంకటేశ్వర్‌రావు, జిల్లా నాయకులు డేగ పోశెట్టి, అంతిరెడ్డి రాజారెడ్డి, పెంటి ఇంద్రుడు, మంద మహిపాల్, బైండ్ల ప్రశాంత్, రమేష్ తదితరులున్నారు.

మంత్రి గురించి మాట్లాడే హక్కులేదు


మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

బాల్కొండ: మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి గురించి మాట్లాడే నైతిక హక్కు ఈరవత్రి అనిల్‌కు, సునీల్‌రెడ్డిలకు లేదని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బద్దం ప్రవీణ్‌రెడ్డి అన్నారు. సోమవారం బాల్కొండ మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం బాల్కొండ మండల కేంద్రంలోనే రూ. 114 కోట్లతో మంత్రి అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. దమ్ముంటే మండల కేంద్రానికి వస్తే అభివృద్ధిని చూపిస్తామన్నారు. వారి స్థాయికి మంత్రి అవసరం లేదన్నారు. నియోజక వర్గంలో ఇప్పటి వరకు రూ. 654 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. మంత్రి కమీషన్లు తీసుకుంటారని ఆరోపించడం సిగ్గుచేటన్నారు. గంజాయికి మంత్రికి, మంత్రి తమ్ముడికి ఎలాంటి సంబంధం లేదన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు తౌటు గంగాధర్, లింగాగౌడ్, దాసరి వెంకటేశ్, నరెందర్, ఇష్తకర్, సురాజ్‌రెడ్డి , రాజేశ్వర్, ఫయాజ్, సాగర్‌యాదవ్, రాంరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలి


ర్యాలీలో పాల్గొన్న విశ్రాంత ఉద్యోగులు

బోధన్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆ సంఘం బోధన్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం పట్టణ కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తు ర్యాలీ, ధర్నా నిర్వహించారు. సంఘ కార్యాలయం వద్ద నుంచి ఆర్డీవో ఆఫీస్ వరకు ర్యాలీగా వెళ్లి అక్కడ ధర్నా చేశారు. ఆర్డీవో రాజేశ్వర్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉద్యోగుల సంఘం తాలూకా శాఖ ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ వయోభారంతో ఉన్న పెన్షనర్లు తమ సమస్యలు పరిష్కరించాలని రోడ్డెక్కె పరిస్థితి రావడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సంఘానికి ప్రభుత్వం గుర్తింపు ఇవ్వాలన్నారు. ప్రతినిధులు మురహరి, కె. సాయిలు, ఇస్మాయిల్, సత్యనారాయణ తదితరులున్నారు.

కార్మికులకు సమగ్ర చట్టం అమలు చేయాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నందిపేట్(ఆర్మూర్) : దేశంలోని 60 శాతం మంది వ్యవసాయ కార్మికులకు సమగ్ర చట్టం అమలు చేయాలని కోరుతూ సోమవారం నందిపేట తహసీల్దార్ అనిల్‌కుమార్‌కు రైతుకూలీ సంఘం నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. కనీస వేతనాన్ని రూ. 600కు పెంచాలన్నారు. 50ఏళ్లు దాటిన వ్యవసాయ కార్మికులకు ఐడీ కార్డు ఇచ్చి రూ. 10 వేల జీవనభృతి ఇవ్వాలన్నారు. డబుల్ ఇళ్లు ఇవ్వాలన్నారు. రైతు సంఘం నాయకులు రాజలింగం, గంగాధర్, దశరథ్, అనంతరావు, దావుద్, గంగారాం, గంగాధర్, లస్మన్న, దేవన్న పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఆర్మూర్‌టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం రిటైర్డు ఉద్యోగుల సంఘం సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో క్యాంప్ సిబ్బందికి, తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయలో అధికారులకు ఆర్మూర్ విశ్రాంత ఉద్యోగులు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆర్మూర్ విశ్రాంత ఉద్యోగుల అధ్యక్షుడు జ్ఞానేశ్వర్, కార్యదర్శి రాజేశ్వర్‌రెడ్డి, రాంరెడ్డి, గంగారాం పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

బోధన్‌టౌన్(బోధన్): విద్యారంగంలో నెలకొన్న సమస్యలను తక్షణమే ప్రభుత్వం పరిష్కరించాలని ఏబీవీపీ పట్టణ శాఖ ప్రతినిధులు డిమాండ్ చేశారు. రాష్ట్ర శాఖ పిలుపు మేరకు తలపెట్టిన పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలను బంద్ పాటించారు. పాఠశాలల వద్దకు వెళ్లి నాయకులు బంద్ చేయించారు.

నేడు ఆర్టీసీ డిపోలో రక్తదాన శిబిరం

బోధన్ : టీఎస్ ఆర్టీసీ ఎండీ సజ్జనార్, చైర్మన్ బాజిరెడ్డి గోవర్దన్ ఆదేశాల మేరకు మంగళవారం పట్టణ కేంద్రంలోని ఆర్టీసి డిపోలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నామని డీఎం టీఎస్ స్వామి సోమవారం ప్రకటనలో తెలిపారు. స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు దాతలు ముందుకు రావాలని కోరారు. తమ పేర్లను 7382840367, 9959226001లో సంప్రదించి చేసుకోవాలని సూచించారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు శిబిరం కొనసాగుతుందని పేర్కొన్నారు.

మళ్లీ డిగ్రీ సెమిస్టర్ పరీక్ష రాయించాలి



బోధన్ : బోధన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం బీకాం డిగ్రీ ఫైనల్ ఇయర్ 6వ సెమిస్టర్ మల్టీ మీడియా పరీక్ష నిర్వహణలో కళాశాల అధికారుల తప్పిదం వల్ల విద్యార్థులకు అన్యాయం జరిగిందని, మళ్లీ పరీక్షను రాయించాలని లేనిపక్షంలో విద్యార్థులందరికీ పాస్ చేయాలని భారతీయ విద్యార్థి సేన (బీవీఎస్) జిల్లా కో–కన్వీనర్ సీహెచ్ లోకేష్‌గౌడ్ డిమాండ్ చేశారు. మల్టీ మీడియా సెమిస్టర్ పరీక్షకు యూనివర్సిటీ మూడు గంటల సమయం ఇవ్వగా, ఈ కళాశాలలో అబ్జర్వర్ గంటన్నరకే పేపర్ లాక్కున్నారని పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం పట్టణ కేంద్రంలోని ఆర్డీవో ఆఫీసు ఎదుట నాయకులు ధర్నా నిర్వహించి ఆర్డీవో రాజేశ్వర్‌కు వినతిపత్రం అందించారు.లింగం, యోగేష్, ఇమ్రాన్, లతీఫ్, గణేష్,యాకుబ్, ప్రజ్వల్ పాల్గొన్నారు.

బీజేపీకి రాజీనామా

రుద్రూర్ : మండల బీజేపీ నాయకుడు కర్రే పోచిరాం బీజేపీకి రాజీనామా చేస్తున్నట్టు సోమవారం ప్రకటించారు. కోటగిరిలో మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై బీజేపీ నిర్లక్ష్యంగా ఉన్నందున ఇక నుంచి ఎమ్మార్పీఎస్ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

హైదరాబాద్ తరలిన రైతు కూలీ సంఘం నాయకులు

రెంజల్(బోధన్) : రెంజల్, ఎడపల్లి, నవీపేట్ మండలాలకు చెందిన సీపీఐ ఎంఎల్ నాయకులు సోమవారం హైదరాబాద్‌కు తరలి వెళ్లారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్న ప్రజాపంథా తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి డీవీ కృష్ణ ప్రథమ వర్ధంతి సభలో పాల్గొన్నారు.

జగన్నాథ రథయాత్ర వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

ఆర్మూర్‌టౌన్ : ఆర్మూర్ పట్టణంలోని ఇస్కాన్ కేంద్రంలో జగన్నాథ రథ యాత్ర పత్రికలను సోమవారం ప్రభూజీ రమానంద్‌రాయ్, ఆదిపురుష ప్రభూజీ, ఆర్మూర్ జగన్నాథ సేవ సమితి ప్రతినిధి గుజరాతి నివేదన్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ నెల 28న బుధవారం మధ్యాహ్నం 2.30 నుంచి కంఠేశ్వర్ ఆలయం నుంచి పులాంగ్ చౌరస్తా వరకు రథ యాత్ర కొనసాగుతుందన్నారు. అనంతరం విజయ లక్ష్మి ఫంక్షన్‌హాల్‌లో మంగళ హారతి, కీర్తన, అన్నదానం ఉంటుందన్నారు.ప్రతినిధులు చౌల్ దుర్గాప్రసాద్, నరేష్, రాహుల్, సురేష్ ఉన్నారు.

ప్రశాంతంగా నాళేశ్వరం ఎత్తిపోతల సహకార సంఘం ఎన్నికలు

బోధన్ : నవీపేట మండలం నాళేశ్వరం ఎత్తిపోతల సహకార సంఘ ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. పోలింగ్ అనంతరం ఓట్ల కౌంటింగ్ జరిగింది. ఈ సహకార సంఘం 11 మంది డైరెక్టర్ స్థానాలకుగాను పోటీ పడ్డారు. మొత్తం 542 ఓటర్లు ఉండగా 499 పోల్ అయ్యాయి. డైరెక్టర్లుగా ఆర్మూర్ గంగాధర్, చిన్నరొటి నవీన్, ర్యాగ రాజేశ్వర్, పుప్పాల భోజన్న, పుప్పాల శ్రీకాంత్, బి.సాయిలు, హన్మాండ్లు, రొయ్యల పోశెట్టి, గంగామణి, శిరీష, లక్ష్మి డైరెక్టర్లుగా గెలుపొందారు. సొసైటీ చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నిక మంగళవారం జరుగనున్నాయి.

దోమల నివారణపై అవగాహన



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో సోమవారం వైద్య ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో దోమల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సబ్ యూనిట్ అధికారి సాయి మాట్లాడుతూ వర్షకాలం ప్రారంభమైనందున దోమల నివారణకు నీరు నిలువ కాకుండా చూసుకోవాలని సూచించారు. ఇంటి ఆవరణతో పాటు పరిసర ప్రాంతాల్లో పూల కుండీలు, కొబ్బరి చిప్పలు, పాత డబ్బాలు, కూలర్లు, పాత వస్తువులు ఉంచుకోవద్దన్నారు. హెల్త్ సూపర్‌వైజర్ రవీందర్, ఆరోగ్య కార్యకర్త జక్కుల మోహన్, ఆశా కార్యకర్తలు నవ్య, రమ, సుభద్ర, మమత పాల్గొన్నారు.

సమాచారం..

శివాలయంలో ప్రత్యేక పూజలు



ఆర్మూర్‌టౌన్ : ఆర్మూర్ పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టపై గల శివాలయంలో సోమవారం భక్తులు అధిక సంఖ్యాలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అలాగే మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత, బీఆర్ఎస్ నియోజక వర్గ ఇంచార్జీ ఆశన్నగారి రాజేశ్వర్‌రెడ్డి, స్వామివారిని పంచామృతాలతో అభిషేకం చేశారు. పల్లకీసేవ నిర్వహించారు. అన్నదానం చేశారు. కార్యక్రమంలో బి.సుమన్, పీసీ గంగారెడ్డి, బోబిడే కిషన్, మీనాచందు, లక్ష్మన్, బొండ్ల ఆనంద్, అయ్యప్ప శ్రీనివాస్ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం..

ఆలూర్ మండల పద్మశాలి సంఘం..



పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండల పద్మశాలి సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నుకున్నారు. పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు దీకొండ యాదగిరి ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా చిలుక జ్ఞానేశ్వర్, కార్య నిర్వాహణ అధ్యక్షునిగా బత్తుల హరి, ఉపాధ్యక్షులుగా బొడ్డు గంగాధర్, బింగి సాయిలు, ప్రధాన కార్యదర్శిగా దాసరి రాధాస్వామి, కోశాధికారిగా మూడ శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా సింగం కిషోర్, కార్యనిర్వాహణ కార్యదర్శిగా బొడ్డు ఆంజనేయులు ఎన్నికయ్యారు. పద్మశాలి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పుల్గం హన్మాండ్లు, రాపెల్లి గురుచరణం, మెర్గు లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	ఆదిపురుష్ (3డీ–తెలుగు) - 10.30 10.30, 2.15, 6.00, 9.45
స్క్రీన్-2 –	ఆదిపురుష్ (3డీ–తెలుగు) - 11.15, 3.00, 6.45, 10.30
స్క్రీన్-3 –	1920 హర్రర్స్ ఆఫ్ ది(తెలుగు) - 10.55, 9.50, అశ్విన్స్ (తెలుగు) 1.40, 7.20 ది ఫ్లాష్(తెలుగు) 4.10
స్క్రీన్-4 –	భీమదేవరపల్లి(తెలుగు) - 12.40,6.20, 9.15. 1920 హర్రర్స్ ఆఫ్ ది(తెలుగు) 3.35

క్లుప్తంగా

బాలుడికి ఆర్థికసాయం



డొంకేశ్వర్(ఆర్మూర్) : తల్లిదండ్రుల్లేని అనాధ బాలుడికి డొంకేశ్వర్ మండలం గాదేపల్లి సర్పంచ్ నక్కల భూమేశ్ సాయం అందించారు. పదేళ్ల వయసున్న శివకుమార్ ప్రస్తుతం నానమ్మ వద్ద ఉంటున్నాడు. అయితే, ఎమ్మెల్యే జీవన్ రెడ్డి ఆదేశాల మేరకు సర్పంచ్ బాలుడిని ఆనంద నిలయంలో చేర్పించి రూ.5వేలు ఆర్థికసాయం చేశారు.

పిరమిడ్ స్ట్రక్చర్ పనులకు పూజలు



ఆర్మూర్‌టౌన్ : ఆర్మూర్ పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టపై నిర్మిస్తున్న పిరమిడ్ శ్రీ నవనాథ సిద్దేశ్వ ధ్యాన మహా శక్తిక్షేత్రం స్ట్రక్చర్ నిర్మాణ పనులను సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత, బీఆర్ఎస్ నియోజక వర్గ ఇన్‌చార్జి ఆశన్నగారి రాజేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. ఒక గొప్ప ధ్యాన కేంద్రంగా ఇది మారుతుందన్నారు. బ్రహ్మ విద్యారిష్ఠ తటవర్తి రాజ్యలక్ష్మి, నందీశ్వర మహారాజ్, పీఎస్ఎస్ఎం నవనాథపురం కమిటీ సభ్యులు కృపారెడ్డి,గంగారాం, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేసులను రద్దు చేయాలి

బోధన్ : ములుగు జిల్లా తాడ్వాయి పోలీస్ స్టేషన్‌లో పీవోడబ్ల్యూ జాతీయ కన్వీనర్ సంధ్యతో పాటు మరో 152 మంది పై ఉపా క్రింద పెట్టిన కుట్ర కేసులను రద్దు చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి పుట్ట వరదయ్య డిమాండ్ చేశారు. పార్టీ రాష్ట్ర కమిటీ ముద్రించిన వాల్ పోస్టర్లను సోమవారం పట్టణ కేంద్రంలోని ఐఎఫ్‌టీయూ ఆఫీసులో ఆవిష్కరించారు. నాయకులు షేక్ నజీర్, లక్ష్మణ్ గౌడ్, సురేష్, లక్ష్మణ్‌లు పాల్గొన్నారు.

లాయర్ హన్మంత్ రావుకు సన్మానం



బోధన్ : బోధన్‌కు చెందిన న్యాయవాది సీహెచ్‌వీ హన్మంత్‌రావు టీడీపీ నిజామాబాద్ పార్లమెంట్ నియోజక వర్గ ప్రధాన కార్యదర్శిగా నియమాకమైన సందర్భాన్ని పురస్కరించుకుని సోమవారం పట్టణ కేంద్రంలోని కోర్టులో న్యాయవాదులు హన్మంత్‌రావును సన్మానించారు. బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు గంగారెడ్డి, లాయర్లు అర్జున్ రాందర్, గిరిధర్‌రాజ్, శ్రీనివాస్, పోశెట్టి, కోటేశ్వర్‌రావు, సాయిలు, శంకర్, బానోత్ రమేష్, కాశీంబాషా, ఆరిఫోద్దీన్,లక్ష్మి నారాయణపాల్గొన్నారు.

బీజేపీ ఇంటింటి ప్రచారం




పెర్కిట్(ఆర్మూర్) : ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో సోమవారం బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు పైడి రాకేశ్ రెడ్డి మాట్లాడుతూ ప్రధాని మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం తొమ్మిదేళ్లలో దేశంలో అనేక అభివృద్ధి పనులు, సంక్షేమం, సంస్కరణలు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ పాలెపు రాజు, పట్టణ అధ్యక్షుడు జెస్సు అనిల్, తిరుపతి నాయక్, సాయి కుమార్, సాయినాథ్ రెడ్డి, వాసు, పరశురాం గౌడ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నందిపేట్(ఆర్మూర్) : మండలంలోని తల్వేద గ్రామంలో సోమవారం ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు పైడి రాకేశ్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ బీజేపీ పథకాలు ప్రతి ఇంటికి చేరుతున్నాయన్నారు. ఆర్మూర్ నియోజకవర్గ కన్వీనర్ పాలెపు రాజు, బీజేపీ మండల అధ్యక్షుడు సాయి రెడ్డి, యువ మోర్చా ఉపాధ్యక్షుడు సురేష్,మెండు శ్రీకాంత్ పాల్గొన్నారు.

బొప్పాపూర్‌లో..

రుద్రూర్ : రుద్రూర్ మండలంలో సోమవారం బీజేపీ నాయకులు ఇంటింటికి వెళ్లి కేంద్ర ప్రభుత్వ పథకాల గూర్చి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు సుధాకర్ గౌడ్, బీజేపీ మండల ఉపాధ్యక్షులు సాయిలు, రాజేష్, హరికృష్ణ తదితరులున్నారు.

విరిగిపడ్డ చెట్టుతో రాకపోకలు బంద్



ఎడపల్లి(బోధన్) : మండలంలోని అలీసాగర్ నుంచి బాపునగర్ మీదుగా బోధన్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై సోమవారం వర్షానికి గాలికి భారీ చెట్టు విరిగి రోడ్డుకు అడ్డంగా పడింది. మార్గం గుండా రాకపోకలు బంద్ అయ్యాయి. వాహనదారులు ఐదు కిలోమీటర్ల తిరిగి వయా జానకంపేట ద్వారా బోధన వైపునకు వెళ్లాల్సి వస్తుంది. చెట్టు విరిగి రోడ్డుకు అడ్డంగా గంటలు గడిచిన ఆర్ అండ్ బి సిబ్బంది చెట్టును తొలగించలేదు.

సంక్షిప్తం

మలేరియా నివారణ మాసోత్సవాలు




నందిపేట్(ఆర్మూర్): నందిపేట మండలంలోని అయిలాపూర్‌లో మలేరియా నివారణ మాసోత్సవాల్లో భాగంగా నందిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని వాడవాడలా తిరుగుతూ మురికి గుంతలు, వర్షపు నీళ్లు నిలువ ఉన్న ప్రాంతాల్లో టిమిఫాస్ స్ప్రే చేశారు. లోతట్టు ప్రాంతాల్లో మొరం నింపాలని సర్పంచు తెలిపారు. సర్పంచు సాయరెడ్డి, వైద్యాధికారి ప్రవీన్, దేవన్న, భాస్కర్, ఆరోగ్య కార్యకర్త రేణుక ఆశా వర్కర్లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా సాహూ మహారాజ్ జయంతి

వేల్పూర్ : వేల్పూర్ మండలం రామన్నపేట్‌లో సోమవారం ఛత్రపతి సాహూ మహారాజ్ జయంతిని అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ యూత్ సభ్యులు బాబూరావు, సుమాన్, వినోద్, దినేష్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా పండుగలు జరుపుకోవాలి



ఆర్మూర్‌టౌన్ : ముస్లింలు ఈనెల 29న బక్రీద్‌ను ప్రశాంత వాతవరణంలో జరుపుకోవాలని ఆర్మూర్ ఏసీపీ ప్రభాకర్‌రావు అన్నారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని ఎంఆర్‌గార్డెన్‌లో సోమవారం ఉన్నత అధికారులు ఆదేశాల మేరకు శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. గోవులను తరలించకుండా ప్రధాన రహదారులపై చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. లా అండ్ ఆర్డర్‌ను చేతుల్లోకి తీసుకోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్‌మున్ను, ఎస్‌హెచ్‌వో సురేష్‌బాబు, సీనియర్ నాయకుడు పండిత్‌ప్రేమ్, కౌన్సిలర్‌లు రోహిమాన్ తదితరులు పాల్గొన్నారు.

కౌశిక్ రెడ్డిని పదవి నుంచి తప్పించాలి

కమ్మర్‌పల్లి : జర్నలిస్ట్‌పై దాడి చేయడమే గాక, ముదిరాజ్ కులస్తులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డిని పదవి నుంచి తప్పించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కమ్మర్‌పల్లి : కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్‌కు చెందిన పీఎంపీ వైద్యుడు అంగరి శ్రీనివాస్ ఇటీవల గుండెపోటుతో మరణించాడు. దీంతో ఆరెంజ్ ట్రావెల్స్ యజమాని ముత్యాల సునీల్‌రెడ్డి ఆయన కుటుంబ సభ్యులను సోమవారం పరామర్శించారు. ఆయన వెంట యెనుగందుల శైలేందర్ ఉన్నారు.

పాఠశాలల తనిఖీ

పెర్కిట్(ఆర్మూర్) : ఆర్మూర్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలలను ఎంఈవో రాజ గంగారాం సోమవారం తనిఖీ చేశారు. ఆయన గోవింద్‌పేట్, చేపూర్, మామిడిపల్లి, పెర్కిట్ ప్రైమరి పాఠశాలలతో పాటు మండలంలోని చేపూర్, గోవింద్‌పేట్ ఉన్నత పాఠశాలలను పరిశీలించారు. జులై 6వ తేదీ వరకు బడిబాట తిరిగి ప్రారంభించనున్నట్లు తెలిపారు. జులై 31వ తేదీ వరకు పుస్తక పఠనోత్సవ కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. హెచ్ఎంలు కరుణాకర్, మాధవ రెడ్డి, గంగామణి, అనసూయ, పద్మావతి, విజయసారథి, ప్రసాద్, మధుసూదన్, కవిత తదితరులు పాల్గొన్నారు.

క్షత్రియలో వీడ్కోలు సమావేశం

పెర్కిట్(ఆర్మూర్) : ఆర్మూర్ మండలం చేపూర్ క్షత్రియ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం ఫోర్త్ ఇయర్ చదువుతున్న ఇంజినీరింగ్ విద్యార్థులకు వీడ్కోలు సమావేశం, సెకండియర్ చదువుతున్న విద్యార్థులకు ఫ్రెషర్స్ పార్టీ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల కార్యదర్శి అల్జాపూర్ దేవేందర్ మాట్లాడుతూ విద్యార్థులు సమాజానికి ఆదర్శంగా ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపల్ ఆర్‌కే పాండే, అధ్యాపకులు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ..

పెర్కిట్(ఆర్మూర్) : ఆర్మూర్ మండలం సుర్బిర్యాల్‌లో సోమవారం లబ్దిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బీఆర్ఎస్ నాయకులు సట్లపల్లి సవిత గణేశ్ పంపిణీ చేశారు ఉప సర్పంచ్ రాము, మోహన్ రెడ్డి, సుధాకర్ రెడ్డి తదితరులున్నారు.

'డబుల్' ఇల్లు ఇప్పించండి

వర్ని : మండలంలోని కోటయ్య క్యాంప్ గ్రామానికి చెందిన డబుల్ బెడ్ రూం లబ్ధిదారుడు బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ వర్ని మండల కేంద్రంలో ఆందోళనకు ప్రయత్నించాడు.

సోమవారం ఉదయం మండల కేంద్రంలో కోటయ్య క్యాంప్‌నకు చెందిన చింతల శోభ కుమారుడు రవి రిలే నిరాహార దీక్ష చేపట్టే ప్రయత్నం చేయగా పోలీసులు ముందస్తుగా ఆయనను అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన రవి మాట్లాడుతూ తన తల్లి పేరున డబుల్ ఇల్లు మంజూరు కాగా రూ. 75వేలు ఇచ్చారని, అయితే ఫైనల్ బిల్ ఇచ్చేందుకు అధికారులు తన కుటుంబాన్ని సతాయిస్తున్నారన్నారు.

ధర్మపురి క్షేత్ర పాదయాత్ర

నందిపేట్(ఆర్మూర్): నందిపేట మండలంలోని కౌ ల్పూర్‌లో ఉన్న శ్రీ భూమ యోగేశ్వర యోగశక్తి పీఠం వ్యవస్థాపకులు చింత రమేశ్ స్వామి ఆధ్వర్యంలో ధర్మపురి క్షేత్ర పాదయాత్రనే చేపట్టారు. కేదారీశ్వర ఆశ్రమం నుంచి పాదయాత్ర ప్రారంభమై మంగళవారం సాయంత్రం నాటికి జగిత్యాల జిల్లా ధర్మపురి పుణ్యక్షేత్రం చేరుకుంటామని చింత రమేశ్ స్వామి తెలిపారు. ఆశ్రమ కమిటీ సభ్యులు గంగాధర్, దేవాగౌడ్, దేవన్న, లక్ష్మీనారాయణ తదితరులున్నారు.

నేటి నుంచి గ్రామ దేవతల పండుగ

రుద్రూర్ : రుద్రూర్ మండల కేంద్రంలో మంగళవారం నుండి ఊర పండగ నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రామంలోకి గాంధీ చౌక్ వద్ద ఐదు రోజుల క్రితం గ్రామ పెద్దలు, కుల సంఘాల బాధ్యులు సమావేశమయ్యారు. ఎనిమిదేళ్ల తర్వాత పండగ జరుగుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

గ్రామ దేవతలకు జలాభిషేకం

బాల్కొండ : ముప్కాల్ మండలం రెంజర్లలో వీడీసీ ఆధ్వర్యంలో సో మవారం గ్రామ దేవతలకు జలాభిషేకం నిర్వహించారు. ముందుగా పవిత్ర గోదావరి వరకు కాలినడకన వెళ్లి గంగా నీళ్లు తీసుకొచ్చారు. అనంతరం గ్రామంలో డప్పు వాయిద్యాలతో, వల గొడుగుతో ఊరేగించారు. గ్రామంలోని కోదండరామాలయం, హనుమాన్ తదితర ఆలయాల్లో అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీడీసీ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.